



ఆవే రైళ్ళు, అలాగే నడుస్తున్నాయి, అప్పటికీ యిప్పటికీ ఆ పట్టాలమీదే! అప్పుడు మద్రాసు నుంచి బెజవాడ వెళ్ళేది - ఇప్పుడు విజయవాడ పోతోంది... అంతే!

ఆ రోజుల్లో అందమయిన అమ్మాయి లేని కంపార్ట్‌మెంటులో కాలు పెట్టేవాడు కాదు సుందరం,

ఇప్పుడు రక్తం కాస్త చల్లబడింది. సీటు సంపాయించి ఏదయినా ఆడ గాలి తగలకపోతుందా అని దిక్కులు చూస్తున్నాడు,

ఇంకా పళ్ళూడనందువల్ల, కళ్ళ కింద ముడతలు స్పష్టంగా కనిపించక పోవడంవల్ల సుందర్రావుగానే మిగిలిపోయాడు వుడ్ బీ సుందరయ్య.

అంతే.... అవతల మూడు సీట్లు ఖాళీవున్నా సరిగ్గా అతని పక్కనే కూర్చుంది ఆ అమ్మాయి.

సుందర్రావు కష్టపడకుండా ఆ పిల్లే కిలకిలా నవ్వేసింది. లిట్మసు కాగితంలా ఆమె బుగ్గలరంగు మారిపోయింది. "మీరు సుందరంగారేకదూ...."

అది ఏ.సీ.కంపార్ట్మెంటయినా, ఆమె కాలుపెట్టగానే వాతావరణంలో వుష్ణోగ్రత పెరిగింది. ఆవిడమీదే వున్నాయి పరిసరాల్లో వున్న కళ్ళన్నీ.

ఒక్కసారిగా నవ్వుకున్నారు యిద్దరూ.

"చాలా ఏళ్ళకి.... గమ్మత్తుగా కలిశాం...." మళ్ళీ అదే పంచరంగుల నవ్వు.

"మీరూ అప్పటికీ, యిప్పటికీ...." - అప్పటికన్నా యిప్పుడే అందంగా వున్నారని ధ్వనించాడు.

పొంగి పోయింది. ఆ పొంగు మరో కంటికి కనిపించకుండా దాచుకోగల శక్తి ఆమె కుంది. "క్షేమంగా వున్నారు కదూ........ మీరూ....మీ...."

ఆమె వాక్యం పూర్తి చెయ్యక ముందే తనెంత బాగున్నాడో తన డ్రెస్ చెబుతుంది. ఏ. సీ. కంపార్టుమెంట్ చెబుతుంది.

ఎందుకో ఆమె చూపులు శూన్యంలో చిక్కుకున్నాయి.

"పెళ్ళయిందా?" సూటిగా పాయింటు కొచ్చాడు.

అదిరిపడింది. "వాట్....!"

"మీ రింకా నా కంటికి కన్య లాగే...."

"సారీ మై డియర్...."

"ఐయామ్ ఆల్సో"

అంత సొంపు మరే భాషకీ లేదు. దొరసానుల అవయవాల్లా దానికి వంపు లెక్కువ; బిగువెక్కువ.

"మీ శ్రీవారు?"

"మా హబ్బీ లండన్ లో వున్నారు."

లండన్ మొగుణ్ణి చేసుకున్నందుకు బాధ, వాడు (పక్కన) ఇండియాలో లేనందుకు సంతోషం!

"లూసీ, డెన్నీ....రూబీ.... డెహరాడూన్లో చదువుకుంటున్నారు" - అడక్కుండా ఆమే చెప్పింది. ముచ్చటగా ముగ్గుర్ని కన్నా కన్యలాగే వుంది.

"నా పిల్లలు చదవరు. మాస్టర్లు చదువుతూవుంటే నిద్రపోతూ వింటారు........లెట్ దెమ్ ఎన్జాయ్...."

"సర్టెన్లీ."

"నా మిసెస్...." నిట్టూర్చాడు.

వాళ్ళంతా కళ్ళు చేసుకుని వింది.

"ఐ లాస్ట్ హర్...." ఆమె సానుభూతికి భయపడి కిటికీ నుంచి చూశాడు.

ఇదేం పట్టనట్టు రైలు చక్రాలు దొర్లిపోతూనే వున్నాయి - అదే తాళంతో....

చాలాసేపు ఇద్దరిమధ్య మౌనం.

"ఏదైనా ఇండస్ట్రీ...." ఏం చేస్తున్నారని అడిగింది.

"డిటర్జెంట్ ఫాక్టరీ పెట్టాను. నేనే మేనేజింగ్ డైరెక్టర్. మరో అయిదారేళ్లకి మా కాపిటల్ కోటి రూపాయలు కావచ్చు." అతని గొంతు చాలా సాదాగా, మెత్తగా వినిపించింది.

ఆమె కూడా ఆశ్చర్యపడలేదు. "మా హబ్బీ కోటీశ్వరుడైనా పచ్చి కమ్యూనిస్టు. మానవ సేవకోసం తనెన్ని లక్షలు తగలెట్టినా నన్ను మాట్లాడనివ్వడు" రోషాన్ని దిగ మింగుకుంది.

రైలు ఆగింది....కాస్త గొడవ చేసి. నీళ్లు తాగి మళ్ళీ కదిలింది.

ఇద్దరూ ఓ పదిహేనేళ్ళు వెనక్కి వెళ్ళారు.

* *

ఆమెను మొదటిసారి రేస్ క్లబ్బులో బీరు తాగుతూ చూశాడు. మళ్లీ హోటల్ లాన్లో షీవాస్ రీగల్ తాగుతూ చూశాడు.

కంట్రీ డ్రింక్ తాగినంత పనైంది రెండు సార్లూ. అంత కిక్కు!

బాయ్‌గాడి జేబునిండా పచ్చ నోట్లు కుక్కాడు.

"ప్లీజ్ డోంట్ బీ దట్ సిల్లీ...." చాలా సీరియస్‌గా అంది. తనతో కాదు. తనకోసం ట్రయ్ చేసిన బాయ్‌గాడితో.

సుందరం అప్పుడొక టొబాకో మాగ్నెట్ దగ్గర డ్రైవర్ ఉద్యోగం చేస్తున్నాడు. పని చిన్నదయినా దానికి గొప్పగొప్ప కన్సిడరేషన్స్ ఉన్నాయి. కాంతల్ని ఐసు చేసి లాక్కొచ్చే లాఘవం తెలిసుండాలి.

టుబాకో మిలియనీర్‌ది గుంటూరు బ్రాడీపేట. ఆయన సరుకు అటు హిమాలయాలూ, చుట్టూ ఉన్న మూడు సముద్రాలూ దాటి బయటి ప్రపంచానికి పోతుంది. దేశంలో ఉన్న ప్రతి పట్టణంలో గెస్ట్ హౌసు లున్నాయి. ఆయన దిన చర్యలో చాలా ముఖ్యమయిన అంశం రెస్టు తీసుకుంటూ జీవించడం. రెస్టుతో బాగా అలిసిపోయి ఏదయినా మెత్తని విమానంలో మరో గెస్టు హవుస్ కెళ్ళి, మళ్లీ రెస్టు తీసుకుంటూ బత కటం- ఇలా ఆ జీవిత చక్రం క్రమం తప్పకుండా సాగిపోతూ వుంది.

ఆయన రెస్టు చాలా విచిత్రంగా వుంటుంది. చూపులకి కంట్రీ

బూటులా వున్నా ఇంగ్లీషు అనర్గళంగా మాట్లాడాడు. విస్కీ తాగడు. చుట్టూ అర డజను మంది ఆడపిల్లలకి చిత్తుగా తాగించి, వాళ్లు మరచి ప్రవర్తిస్తుంటే చూసి ఆనందించడం, మళ్లీ వాళ్లని స్విమ్మింగ్ పూల్లో నానబెట్టి తెలివి రాగానే మళ్లీ విస్కీలో నానబెట్టాడు.

అంతే. పరస్త్రీలని తాకడు. ఏక పత్నీ వ్రతుడు. కాబట్టి మిగిలిన అనుభూతులన్నీ సుందరానికి దక్కాలి. ఆ గెస్టుహవుస్ నుంచి బాస్ వెళ్లిపోగానే తనే బాస్.

పదహారడుగుల ఏ. సీ. కారు. డీలక్స్ డబల్ ఏ. సీ. బెడ్ రూమ్ అతని సొంతం.

* *

కయ్యిమని బ్రేకు వేశాడు. రథంలాంటి కారు అంగుళం ముందుకు కదల్లేదు.

"టుడేస్ టిప్పు.... విన్న మీకు హెవీ లాసనుకుంటాను?" ఫస్టు ఎంక్లోషర్‌లో రేసు బుక్కుతో లేడీ జేమ్సుబాండ్‌లా వున్న ఆ అమ్మాయితో డైరెక్టుగా మొదటిసారిగా మాటాడాడు.

తన రోజులు బాగున్నాయి. ఆమెను ఫలానా గుర్రాలు కాయమని చెబితే, సరిగ్గా గుర్రాలన్నీ పిచ్చి కుక్కల్లా పరిగెత్తాయి.

ఆ చనువుమీదనే ఆమెతో ఆమె రూమ్‌కెళ్ళి ఆ పిల్ల ఫేస్టుమబట్టి ఆ టాపిక్స్‌మీదే ముచ్చటగా మాట్లాడాడు.

ఐసునుంచి తీసిన షాంపెయిన్ సీసా ఫిరంగిలా పేల్చి "కంపెనీ సేక్.... ప్లీజ్...." అన్నాడు.

"డోంట్ బీ దట్ సిల్లీ...."

ఇంకా గెటవుట్ అనకుండా అంతట్లో సరిపెట్టుకుంది. కుంచించుకుపోయి, చిన్నబుచ్చుకొని, అవమానంనుంచి తేరుకొని బయటికి వచ్చాడు.

వస్తున్నప్పుడు గదిలో సిగరెట్టు పెట్టె, ఎక్కడో ఒక మూల షివాస్ రీగల్ సీసా కనిపించినట్టు గుర్తు.

ఏమో!

ఒకసారి మలేషియన్ పిల్లతో గొప్ప ఎక్స్‌పీరియన్సు వుంది అతనికి.

ఎయిర్ పోర్టులో వంటరిగా సుందరాంగి దిగటం చూశాడు. ఏ తోడూ లేకుండా పోర్టికో నీడలో నించుంది. మంచి సమయం మించిపోకుండా లిఫ్టు కావాలేమో కనుక్కున్నాడు.

'పోరా వెధవా' అనలేదు.

వస్తాననలేదు.

నవ్వుకుంటూ కళ్ళ చివరనుంచి చూస్తూ టాక్సీ ఎక్కింది. మళ్లీ అతన్ని చూసి "బై .... బై" అంది.

అది గుడ్‌బైలా లేదు. వెంటపడి రమ్మన్నట్టుంది. శిరసావహించాడు.

ప్రస్తుతం యీ పిల్ల వున్న హోటల్లోనే దిగింది.

ధైర్యంచేసి రంగంలోకి దిగాడు. తన అంచనా బీరుపోలేదు. హెన్నెస్సీ బ్రాండీ తనచేత తెప్పించి ముప్పాతిక తనే తాగేసి భుజంమీద చెయ్యేసి, లాలనగా తలుపువరకూ తీసుకొచ్చి గుడ్ బై చెప్పకుండా "మెనీమెనీ థాంక్స్ .........యువర్ ఫోన్ నంబర్ ప్లీజ్.....!" అనడిగింది. టొబాకో గారి ఫోన్ నంబరు ఇచ్చాడు. చాలా నైసుగా తలుపు మూస్తూ, తనని బయిటికి పంపింది.

సుందరం చాలా చిక్కులో పడిపోయాడు. టొబాకోగారు వూళ్లోనే వున్నాడు. ఆ నెంబర్లో తనకోసం ఫోన్ చేస్తే బాస్ మరోలా అనుకోవచ్చు.

రాత్రంతా ఫోన్ దగ్గరే కుక్కలా కూర్చున్నాడు.

సరిగ్గా జీరో అవర్, ఫోన్ మోగింది. ఆ పిల్లే!

వెళ్లాడు. తలుపు తీసే వుంది, బెడ్లో తన కోసం నేకెడ్గా వుంటుందనుకున్నాడు, టీపాయ్ మీద ఖాళీ సీసాలో మిగిలిపోయిన రెండు పెగ్గులు కనిపించాయి.

బాత్రూమ్లో నీళ్ళ చప్పుడు విని, తనకోసం స్నానం చేస్తుందనుకున్నాడు. డైల్యూట్ చెయ్యడం యిష్టంలేక 'రా' తాగుతూ, మంచం మీద మధురస్వప్నంలో తేలిపోతూ, సినిమా పాటలు వూహించుకుంటూ పడుకున్నాడు. నిద్రపట్టింది.

కలలో నిద్రలేపింది మలేషియన్ పిల్ల. కళ్ళు తెరిచాడు.

చుట్టూ పోలీసులు కనిపించారు!

దిండుకింద రెండు డాలర్లు ఫేక్ కరెన్సీ. నాలుగు చిన్న పాకెట్లు గంజాయి మాత్రం మద్చుకు వది లేపి వెళ్ళిపోయింది. (బాత్రూంలో నీళ్ళ చప్పుడు ఇంకా వినిపిస్తూనే వుంది.) పిల్ల పత్తాలేదు. తన కథ ఎవరూ నమ్మలేదు.

టొబాకో మిలియనీర్ కాళ్ళ మీదపడి జైల్లో రాళ్ళుమోసే రాత తప్పించుకున్నాడు- చాలా నారోగా....

సుందరానికి పర్సనల్ 'ప్రాబ్లమ్స్'చాలా వున్నాయి. కాలేజీలో చదివే తమ్ముళ్ళిద్దరు - వాళ్ళ పరీక్ష ఫీజు కట్టాలి. ఇన్వాలిడ్ మదర్.........పెళ్ళికి ఎదిగొచ్చిన చెల్లెళ్ళు ముగ్గురు....ఇంకా ఇంకా తీరని దరిద్రం మొదలైనవి.

అయినా తన జాతకంలో నీచ భంగరాజు యోగం వుందని చాలా మంది చెప్పారు.

'ముదనష్టం' ఏదయినా కలిసి రావాలి. ఆ ఛాన్సులేం నియర్ ఫ్యూచర్లో కనిపించడంలేదు. తన జాతకం ఈ జేమ్స్బాండ్ పిల్ల (ఇంకా పేరడగలేదు.) నిజం

చేస్తుందనుకున్నాడు.

మర్నాడు ఆమె బయటికి రాగానే రాత్రి జరిగింది గుర్తు లేనట్టు చాలా మర్యాదగా పలకరించి వెళ్ళిపోయాడు. (అదీ టెక్నిక్‌లో ఒక భాగమే!)

మరో యిరవై నాలుగ్గంటల తరవాత చాలా కాజువల్‌గా కౌంటర్ దగ్గిరే నిలబడి, దూరం నుంచే విష్‌చేసి ఆ పిల్లంటే తనకి లక్ష్యం లేనట్లు తల తిప్పేసుకున్నాడు. (డిటో....!)

మర్నాడు అమాంతం ఆమె బెడ్‌మీద కూర్చొని ఓ మంచి గార్డియన్‌లా, వెల్‌విషర్‌లా, హ్యూమానిటీని టోకుగా ప్రేమించే దేవదూతలా దువ్వి సాయంత్రం వెధవ బోర్డు మీటింగు లేకపోతే తప్పక వస్తానన్నాడు. (డిటో....)

రాలేదు. (డిటో....!)

సరిగ్గా ఉదయం ఆరింటికే హోటల్ బయట ఫర్లాంగు దూరంలో కాపు వేశాడు. ఆ పిల్ల పదింటికి బయటికి రావటం చూసీ చూడగానే ఆమె ముందు అంగుళం దూరంలో బ్రేకు వేశాడు. కాస్త బెదిరి చిన్న ష్రీక్‌లాంటిది యిచ్చి ఆగిపోయింది.

కారెక్కించి బయట ప్రపంచంలోకి లాక్కొచ్చాడు.

"మీకు డ్రైవింగ్ ఫరోగా వచ్చనుకుంటాను?" అడిగాడు.

"మా డాడీకి భయం - నేను యాక్సిడెంట్ చేస్తానని. అందుకని నేర్చుకోనివ్వలేదు." అరవై మైళ్ళ స్పీడులో ఆమె పయట అతని మొహాన్ని కప్పేసింది.

రెవలాన్ వాసన హాయిగా వుంది. ఆ చీర మొహంనుంచి చేతుల్లోకి లాక్కున్నాడు.

"వెరీ సారీ" కప్పుకుంది సిగ్గుపడ్తూ.

"ట్రయి చేస్తారా?" స్టీరింగ్ చూపించాడు.

"నా కీ గేర్లు చాలా గందరగోళం బాబూ" అంది.

"ఇది ఫారిన్ వాహనం. ముఖ్యంగా యీ మేక్‌కి గేర్లుండవు. స్విచ్ ఆన్ చెయ్యడం, పెడల్ నొక్కడం- ఆటోమెటిక్‌గా అదే గేర్లు మార్చుకుంటుంది."

ఉమ్మగా వుంది. అప్పటికే వొళ్ళంతా చమట.

"సరిగ్గా సాయంత్రం నాలుగింటికి వస్తా. బీచ్ రోడ్‌లో ప్రాక్టీస్ యిస్తాను."

క్షేమంగా హోటల్ పోర్టికోలో దింపేసి, సరిగ్గా నాలుగు గంటలకి అయిదు నిముషాలముందే వచ్చేశాడు.

ఆమె రెడీగానే వుంది జీన్స్‌లో.

లోపల కూర్చోగానే రయ్యిమని బీచ్ రోడ్డుకు వచ్చేశాడు.

"ఇలా రండి."

దిగకుండా ఒకళ్ళ మీదినుంచి ఒకళ్ళు సీటు మార్చుకున్నారు.

ప్రథమ పాఠాలు చెప్పి "ట్రయ్ యిట్" అన్నాడు.

యాక్సిలరేటర్ గట్టిగా నొక్కిందేమో! బండి తాచుపాములా సాగి, స్టీరింగ్ కంట్రోల్ లేకపోవటంవల్ల రోడ్డునుంచి పల్లంలోకి దిగిపోయింది.

సుందరం హడలెత్తిపోయాడు. ఆమెను వోవర్‌లుక్ చేసి బ్రేక్ కంట్రోల్ చేశాడు తన కాళ్ళతో.

బండి ఆగింది. రకరకాల శబ్దాలతో.

నాలుగు కాళ్ళూ పెనవేసుకున్నాయి. చుట్టూ నలుగురి కళ్లూ వాళ్ళమీదే వున్నాయి. చక్రాలు నాలుగూ బురదలో కూరుకుపోయాయి. ఇద్దరూ బయట పడ్డారు. చక్రాలు గజంలోతు దిగిపోయాయి.

నలభై మంది జనంతో నెమ్మదిగా గట్టెక్కించి, రోడ్డుమీదకు తెచ్చి, మర్యాదగా ఆ పిల్లని టాక్సీలో పంపించి - తెల్లవార్లూ కడుక్కున్నాడు బురద ఆ స్థితిలో కారు గెస్ట్‌హవుస్‌కి తీసుకెళ్ళలేక.

ఉదయం ఫోన్ చేసి అపాయింట్‌మెంటు ఫిక్స్‌చేసుకున్నాడు ఎడ్వాన్స్‌గా.

ఆ రోజు శకునాలన్నీ బాగున్నాయి. రెండు మూడు గంటల్లో నిర్భయంగా కారు నడపడం నేర్చుకుంది.

అతను భవిష్యత్తులోకి చూస్తున్నాడు.

నిర్మానుష్యంగా వుండే ప్రాంతానికి కారు చేరుకుంది. చుట్టూ వెన్నెల కమ్ముకుంది. కొత్తగా యిస్త్రీచేసిన తెల్లచీరలో హుందాగా కనిపించే బామ్మగారిలా వుంది సముద్రం. హిప్పీల్లాంటి కొబ్బరి చెట్లక్రింద కారు ఆపాడు.

"లెటజ్ స్విమ్"ఆర్డర్ వేశాడు. డిక్కీనుంచి యిద్దరికీ స్విమ్మింగ్ సూట్స్ తీశాడు. అంతా సిద్ధంగానే వచ్చాడు సుందరం— ప్రీ ప్లాన్!

ఆ పిల్ల సిగ్గుపడలేదు. కాస్త కారు చాటు చేసుకొని డ్రస్ మార్చుకుంది.

ఇద్దరూ కెరటాలకు ఎదురు వెళ్ళారు సముద్రాన్ని చీల్చుకుంటూ.

అతనికి అందకుండా ఈత కొడ్తూ చుట్టూ తిరిగింది.

అందుకునేందుకు ప్రయత్నించలేదు సుందరం. కొయ్యకు కట్టిన ఆవును చూస్తున్న సింహంలా దూరంగానే వున్నాడు.

చాలాసేపు అలా గడిపివేసి బయటికి వచ్చారు.

టవల్ అందించాడు.

ఇప్పుడు చంద్రకిరణాలు ఏటవాలుగా ఆమెమీద పడ్తున్నాయి.

తల తుడుచుకుంటూ ఆకాశంలోకి చూస్తూ "మీ మిసెస్‌కి స్విమ్మింగ్ వచ్చా?" అంది.

తెరలుతెరలుగా నవ్వాడు. 'నేను పెళ్ళి చేసుకోలేదు. చేసుకుంటే...." నిన్నే అన్నట్టు, ఆదే సింహం చూపు చూశాడు.

"అంటే.........."

"చేసుకుంటాను, నాకు నచ్చిన పిల్ల దొరికినప్పుడు."

"ఆ పిల్లకి మీరు నచ్చకపోతే?"

అతనేదో అనేలోగా ఆమె గంభీరంగా అందుకుంది. "మీరు నచ్చకపోవడం ఫూలిష్‌నెస్. మీ స్టేటస్‌కి, కల్చర్‌కి మీరు కోరుకున్న పిల్ల కాళ్ళమీదపడి చేసుకుంటుంది."

ఆ శబ్దతరంగాల్లో "స్టేటస్" అనే మాట మాత్రం తుపాకి గుండులా తగిలింది. అప్పుడే సవరణ ప్రతిపాదించబోయి "టూ ఎర్లీ" అనుకున్నాడు.

"రేపూ ఇలాగే వచ్చేద్దాం."

ఆ రోజుతో "ఆఖరాట" అని యిద్దరికీ తెలియదు పాపం.

మర్నాడు చీకటి పడేంతవరకూ డ్రైవింగ్ నేర్చుకుంది ఆ పిల్ల. (ఇంకా పేరు అడగలేదు. స్వీట్, హనీ, డార్లీ.........అనే పిలుస్తున్నాడు.)

"సుందర్, ఇవ్వాళ మీ ఇంటికెళ్దాం." ఆ పిల్లే ప్రపోజ్ చేసింది.

గతుక్కుమనలేదు సుందరం.

గెస్ట్‌హవుస్‌లో ఎవరూ లేరు. గూర్ఖాతప్ప. టొబాకోగారు మరో సిటీలో వున్నాడు. రెస్టుతీసుకుంటూ. బట్లర్‌గాడు ఇంట్లో పెళ్ళాందగ్గిర రెస్టు తీసుకుంటున్నాడు.

ఎందుకయినా మంచిదని రథం వెనకగేటు దగ్గిర ఆపి లోపలికి రమ్మన్నాడు.

"దొడ్డిదారి ఎందుకు డియర్?" అనడిగింది లోపలికి వస్తూ.

"మమ్మీ, డాడీ చూస్తారేమోనని."

"సర్‌ప్రెయిజ్ చేద్దాం."

సమాధానం చెప్పలేక నీళ్ళు నమిలాడు.

గెస్ట్‌హవుస్ లోపల చూసి దంగయిపోయింది ఆ అమ్మాయి. పాలవలే మెత్తని మొసాయిక్ ఫ్లోర్, ఓషన్‌లాంటి స్విమ్మింగ్ పూల్, ఫారిన్ సినిమా సెట్టులాంటి బెడ్‌రూమ్ చూపించాడు.

టొబాకోగారు ప్రియురాళ్ళకి తాగించి వదిలేసిన హేగ్ బాటిల్ బయటికి లాగాడు.

ఒక గుక్క మందిస్తే ఆమె ఆటోమేటిక్‌గా బెడ్‌లోకి నేకెడ్‌గా వచ్చేస్తుం దనుకున్నాడు.

ఐస్ క్యూబ్స్ ఫ్రిజ్‌లోంచి తీసి రెండు గ్లాసులు నింపాడు కాస్ట్లీ లిక్కర్.

ఆమె వద్దనలేదు. "ప్లీజ్....ప్లీజ్ డోంట్ బీ దట్ సిల్లీ...."-ఆ దట్

పిల్లో ఎంతో ముద్దూ గారాబం పొది గింది. "రా" తాగలేనన్నట్లు సోడా కలుపుకుంది.

"ఐ విష్...." ఏదో చెప్పడానికి ప్రారంభించాడు

ఆశగా చూపింది.

"ఐవిల్ మారీ యూ.... రేపే మీ పేరెంట్స్‌ని కలుసుకుందాం."

ఆ మాట వినగానే ఆమె మొహం ఎందుకో తెల్లగా పాలి పోయింది.

"సుందర్..........ముందు మనం తిన్నగా వెళ్ళి మీ పేరెంట్స్ కాళ్ళ మీదపడి ఆశీర్వాదం తీసుకుందాం."

ముందు డ్రింక్ తాగి తరవాత ఆశీర్వాదా లన్నాడు.

నిరుత్సాహంగా చూపింది.

"అయితే యు బ్రాట్ మీ హియర్ ఫర్ దిస్ సిల్లీ ఎఫైర్?"

సుందరం దిగజారి పోయాడు. "ముందు మీ పేరెంట్స్‌ని కన్విన్స్ చేసి..........ఎందుకంటే మా వాళ్ళకి కోపం ఎక్కువ....కాబట్టి రేపే వెళదాం....మన పెళ్ళి ఖాయం."

ఉలిక్కి పడిందామె. తన తల్లితండ్రులను కన్విన్స్ చేయట మనేసరికి చాలా యిబ్బంది లేర్పడతాయి.

"నాకు ఇద్దరు పెళ్ళికాని అక్కలూ, ముగ్గురు చదువుకునే తమ్ముళ్ళూ, పక్షవాతంతో బాధ పడే నాన్నా వున్నారు" అని చెప్ప వలసి వస్తుంది.

అంతేగాక—

"నేను మీరనుకుంటున్నట్టు మిలియనీర్ డాటర్‌ని కాను ప్రయి వేట్ నర్సింగ్‌హోమ్‌లో నర్స్‌గా పనిజేస్తున్నాను. నాకు వచ్చే టిప్స్ మాత్రం రెండు మూడేళ్ళు కూడ బెట్టుకుని, ఒక వారం రోజులు యిలా గడిపేసి వెళ్ళిపోతుంటాను మళ్ళీ గతంలోకి" అని బోధపరచ వలసి వస్తుంది.

ఆలోచనలమధ్య పరాకుగా వున్న ఆమెను సుందరం చేయి పట్టుకుని లోపలకు లాగబోయాడు.

అతని గుండెల్లో దాగిన విషం కనిపెట్టినట్టూ, పొదలో దాగిన పాముని ముంగిస చూసినట్టు చూసిందతనివంక. నిజాని కదంతా తన మనోభావాలని కప్పిపెట్టు కునేందుకు.

విసురుగా విదిలించుకుని ఒక్క పరుగులో కారెక్కి డ్రైవ్ చేసు కుంటూ వెళ్ళిపోయింది. సుందర్ నవ్వుకున్నాడు. ఆ కారు నేర్పింది తనే.

• *

మర్నాడు కారు తాళం కోసమని ఆమె వుంటున్న హోటల్‌గదికి వెళ్లాడు. కారు కీస్ రిసెప్షన్‌లో

యిచ్చి. ఆమె అప్పుడే గదిఖాళీ చేసి వెళ్లిందని చెప్పారు.

ఎన్ని విమానాలు గాలించాడు! ....ఎన్ని ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్స్ వెతికాడు! ఆమె బస్‌లో వెళ్ళిందని అతడికి తెలియదు. తను అనవసరంగా తొందరపడి క్రితం రాత్రి వాంఛ కనబరిచినందు వల్లె ఆమె చెప్పాపెట్టకుండా వెళ్ళిపోయిందని ఎంతగానో నొచ్చుకున్నాడు.

*

ఏ. సీ. కంపార్టుమెంటు ఆగింది ఇంజన్‌తోపాటే. స్టేషన్ రాగానే.

అప్పటికీ తన స్థితిగతులు మిల్లీమీటర్ అయినా మారలేదు. ఎంతచెడ్డా ఫస్ట్‌క్లాస్‌లోనే ప్రయాణం చేస్తుంది. పోష్ హోటల్స్‌కి దాచుకున్న డబ్బు తగలెయ్యటం ప్రస్తుతం తగ్గించింది.

ఆమె పెళ్లి చేసుకోలేదు. అయ్యే సూచనలు కూడా లేవు. (చేసుకుంటే లండన్ మొగుణ్ణే చేసుకోవచ్చు. వాడింకా పుట్టలేదు.)

"మళ్లీ ఎప్పుడు మీటవుతామో ........." విడిపోతూ అడిగింది.

"ఈ కంట్రీలో కాకపోవచ్చు" డిటర్జెంట్ డైరెక్టర్ సమాధానం.

"ఓయస్.... ....అలాగే.,.... ....అంది హడావుడిగా వెళ్లిపోతూ.

"మీ హబ్బీకి నా గుడ్ విషస్ చెప్పండి." అప్రయత్నంగానే అన్నాడు సుందరం.

"పాపం.... మీ మిసెస్...."

ఆమె కళ్లు కాస్త చెమ్మగిల్లాయి.

"మీ పిల్లలకి నా ఆశీస్సులు" నిండుగా దీవించి వెళ్లిపోయింది.

సుందరం బరువుగా వెనక్కి తిరిగాడు.

ఇప్పుడు అతనికి ప్రాబ్లమ్స్ చాలావరకూ తీరిపోయాయి. ఒక సిస్టర్ సూసయిడ్ చేసుకుంది. ఒకావిడ హిస్టీరియాతో పేషీ పడలేక సవ్యంగానే చనిపోయింది గుండె జబ్బుతో. తన కళ్లముందే తన సంతానం పోవడం చూడలేక అమ్మ కళ్లు మూసుకుంది.

తమ్ముళ్ల పరీక్ష ఫీజు కట్టక పోవడంవల్ల డిగ్రీ దొరక్క, చిన్న కారు గుమాస్తా వుద్యోగం చేసుకుంటున్నారు బట్టల దుకాణాల్లో.

మూడో చెల్లెలు, వంట పనులు చేస్తూ ఇంట్లో పనిమనిషి లేని లోటు తీర్చింది.

ఆ పిల్ల (ఇంకా పేరు అడగలేదు) తనది కానందుకు కుంగిపోలేదు; అదృష్టం కలిసి రానందుకు నొచ్చుకోలేదు.

*